న్యూస్ పేపర్ చదవటం ఆపి, వాచీ చూసుకున్నాడు సుందరం.

ఆఫీస్‌కి టైమవుతోందని పేపర్ని మడిచి చంకలో పెట్టుకుని పోర్టికోలోంచి ఇంట్లోకి వెళ్ళబోతూ ఆగాడు. వెనక్కి తిరిగి చూశాడు.




ఎదురింటి డాబా మీద రౌండ్స్ వేస్తోంది... ఉపగ్రహంలా మీనాక్షి. ఎప్పుడూ చీర కట్టుకుని పొందికగా కనిపించే మీనాక్షి ఇవ్వాళ నైటీలో కనిపించేసరికి సుందరానికి మతిపోయింది.

ఈ మధ్య కుక్కలకి భయపడి రోడ్లు మీద కాకుండా ఇలా డాబాల మీద వాకింగ్ చేస్తున్నారన్నమాట అనుకున్నాడు సుందరం.

మీనాక్షికి వయసు నాలుగు పదులు దాటింది. అయినా అంత వయసున్నట్టు కనిపించనివ్వదు. ఎప్పుడూ నవ్వుతూ ఆ వీధిలో ఉన్న ఆడవాళ్ళందరితో కలుపుగోలుగా మాట్లాడుతుంటుంది. ఆమె భర్త బ్యాంక్ మేనేజర్. కొడుకులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అమెరికా ఉద్యోగాలు చేస్తూ రెండు చేతులా డాలర్లు సంపాదిస్తున్నారు.

ఆమెతో అయిదు నిమిషాలు మాట్లాడితే చాలు... ఆ మాటల్లో ముప్పాతిక భాగం అమెరికా కబుర్లే ఉంటాయి. తన డాలర్ కొడుకులిద్దరికీ ఘనమైన కట్నాలు తీసుకుని పెళ్ళిళ్ళు చేసెయ్యటమే ఇప్పుడు మీనాక్షికున్న ఏకైక బాధ్యత.

ఎప్పుడూ పెద్దమనిషి తరహాలో కనిపించే మీనాక్షిని చూసినప్పుడల్లా గౌరవభావమే కలిగేది సుందరానికి. కానీ... ఇప్పుడేమో నైటీ వేసుకున్న ఆమె వంక కొంటెగా చూడాలనిపిస్తోంది.

# తీరని కోరిక

"నిన్న చీరలో లేని అంద మేదో నేడు నైటీలో నిదుర లేచెనెందుకో..." అని మనసు లోనే పాడుకున్నాడు సుందరం.

అసలు ఆమె మీనాక్షేనా అని సుందరానికి అనుమానం కలగక పోలేదు. తనకి నిద్రమత్తు ఇంకా వీడలేదేమో అనుకున్నాడు కూడా. అందుకే కళ్ళు నులుముకుని మరీ చూసాడు.

"మీనాక్షే..! సందేహం లేదు! నైటీలో ఎంత ముచ్చటగా ఉందీ...! ముద్దు గుమ్మలాగుందీ!" అనుకుంటూ కళ్ళప్పగించి చూస్తున్న సుందరం భార్య పిలుపు విని ఉలిక్కిపడ్డాడు.

"ఇక చాల్లే! లోపలికి రండి!" కరుకుగా పిలిచింది అతని భార్య వనజ.

"ఏంటీ? అటు చూస్తున్నారు?" నడుముకి చేతులానించుకుని కళ్ళు పెద్దవి చేసి కోపంగా భర్తని అడిగింది వనజ.

"ఎటూ..." తలవంచుకుని అమాయకంగా అడిగాడు సుందరం.

"అటూ..." అంది వనజ ఎదురింటి డాబా వైపు కళ్ళతోనే చూపిస్తూ.

"అటంటే... ఎటూ?" ఎటో చూస్తూ అడిగాడు సుందరం. అతను ఆమెకి దొరకదలుచుకోలేదు.

"ఎదురింటి డాబావైపు కళ్ళప్పగించి చూడటం లేదూ" దగ్గరికొచ్చి భర్త మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ రెడ్‌హేండెడ్‌గా దొంగని పట్టుకున్న పోలీసులా అడిగింది వనజ.

"లేదే!" నిబ్బరంగా అన్నాడు సుందరం.

గుండెలు తీసిన బంటు కదా మీరు... అని తన మనసులోనే అనుకుని, "మరేం చేస్తున్నారు మహాత్మా!" అడిగింది వనజ.

"శరీరానికి మంచిదని సన్‌బాత్ చేస్తున్నా"

"ఓహో! అలాగా! మీ మేధాశక్తికి జోహార్లు మహాశయా! అవునూ... ఇక్కడ సన్‌బాతా? ఇదేమన్నా గోవా బీచ్ అనుకున్నారా?"

"వనం! గోవా బీచ్‌లో సన్‌బాత్ చేస్తారా? నాకింతవరకూ ఈ విషయమే తెలియదు. ఆంధ్రాబోర్డర్ దాటితేనా? నేనెప్పుడూ గోవాకి వెళ్ళలేదు. అంతదాకా ఎందుకూ... బాపట్ల దగ్గర సూర్యలంక బీచ్‌కి కూడా వెళ్ళలేదు. అది సరే కానీ... గోవాలో సన్‌బాత్ చేస్తారని నీకెలా తెలుసు?" తెలివిగా అనుకుని అతి తెలివి తక్కువ ప్రశ్న వేసాడు సుందరం.

"మీలాంటి వాళ్ళు చెబితే తెలిసింది లేండి!" విసురుగా అంది వనజ.

తన చూపుల్నీ... ఆ చూపుల వెనక ఉన్న దురుద్దేశాన్నీ భార్య పసిగట్టిందనీ... ఇక మాటల్ని పొడిగించటం మర్యాదకాదనీ గ్రహించి మౌనంగా ఉండిపోయాడు సుందరం.

"అయినా... ఆవిడ వయసెంత? మీ వయసెంత? బుద్ధుండాలి!"

"ఈ వయసులో ఆవిడ నైటీ వేసుకోవడం బాగుందా? ఏమైనా... నైటీలో గొప్ప ఎట్రాక్షన్ ఉందిలే!" గబుక్కున నోరుజారాడు సుందరం.

వనజకి "క్లూ" దొరికితే చాలు... చాకిరేవు పెట్టేస్తుంది. ఇక ఉతుకుడే... ఉతుకుడు.

"ఆవిడ వళ్ళూ ఆవిడ ఇష్టం! ఆవిడేం వేసుకుంటే మీకెందుకూ?"

డి. శ్రీనివాస దీక్షితులు

"నైటీ వేసుకుని తగుదునమ్మా అంటూ డాబామీద తైతక్కలాడుతూంటే కళ్ళూరుకుంటాయా? చూస్తాయి. కళ్ళకి కూడా ఇష్టాయిష్టాలుంటాయి కదా!" అన్నాడు సుందరం పెద్ద థియరీ కనిపెట్టినట్టు.

"తైతక్కలాడటంలేదు... వాకింగ్ చేస్తోంది!"

"అదే... ఎందుకనీ?"

"ట్రిమ్‌గా ఉండటానికి"

"ఆవిడ ఇప్పుడు ట్రిమ్‌గానే ఉందిగా నయనతారల్లే" అని పైకి అనబోయి మనసులోనే గొణుక్కున్నాడు సుందరం.

"ఏమిటో గొణుగుతున్నారు?"

"ఆ ఏం లేదు! ఎప్పటినుంచో నాకో కోరిక"

"ఆమెని చూడాలనా?"

"ఛ ఊరుకో! ఏమిటా మాటలు?"

"మరేంటీ మీ కోరిక?"

"నైటీలో నిన్ను చూడాలని"

"ఇంకా నయం... ఓణీ వేసుకోమనలేదు"

"స్వప్నాల డాబా మీద నాలుగు చెరగులూ పరచి, కుర్రకారు గుండెల్ని పిండి వడియాలు పెట్టేసిన జాణ - ఓణీ అన్నాడొక కవిపుంగవుడు. నువ్వు పరికిణీ కట్టుకుని... ఓణీ వేసుకుంటానంటే అంతకంటే నాక్కావలసిందేముందీ?"

"పరికిణీ గురించి ఏం చెప్పలేదా ఆ కవి పుంగవుడు..."

"ఎందుకు చెప్పలేదూ... మహాభేషుగ్గా చెప్పాడు. కోడిపెట్టంటి వయస్సుని కప్పెట్టిన బుట్టల్లే ఉంటుంది పరికిణీ అన్నాడు"

"పిచ్చి కుదిరింది రోకలి తలకి చుట్టమన్నాట్ట వెనకటికి మీలాంటి వాడొకడు. మీకొచ్చే జీతం నాలుగువేళ్ళూ నోట్లోకి పోవడానికే చాలటం లేదు. రెండ్రోజుల్లో బుజ్జోడికి కాన్వెంటు ఫీజు కట్టాలి. ఇంకా ఇంటి అద్దె... పాల బాకీ... సరుకుల కొట్టు ఖాతా... కాన్వెంట్ రిక్షా... కూరలూ...

"చాలు! చాలు! ఇక దండకం ఆపు తల్లీ! అవన్నీ నేను చూసుకుంటాలే కానీ... ముందీ మాట చెప్పు! నైటీ వేసుకోవటం నీకిష్టమేనా?" అడిగాడు సుందరం.

పల్లెటూళ్ళో పాతకాలం ఇంట్లో పెరిగిన వనజకి ఫ్యాషన్లంటే కొంత బెరుకుంది. కానీ... ఆమెకి మోజులేదని చెప్పలేం. పైకి మాత్రం ఫ్యాషన్లంటే అస్సలు ఇష్టం లేనట్టుగా మాట్లాడుతుంటుంది.

సుందరానికి మాత్రం ఫ్యాషన్లంటే తగని మోజు. భర్త మాటలకి వనజ కొంత మెత్తబడింది.

"నాకు బాగుండదేమో.." నసిగింది వనజ.

"ఎవరు చెప్పారు నీకు బాగుండదని? నైటీ వేసుకుంటే నువ్వు మీనాక్షి తాతమ్మలాగుంటావు" రెట్టించిన ఉత్సాహంతో అన్నాడు సుందరం.


"నా వయసేంటి? ఆవిడ వయసేంటి?" కోపం తెచ్చుకుంది వనజ.

సుందరం నాలిక్కరుచుకున్నాడు.

"ఊరికే మాట వరసకి అన్నాను కానీ మీనాక్షి కంటే నువ్వే బాగుంటావు" అన్నాడు సుందరం. మెత్తబడింది వనజ.

"నైటీ వేసుకుంటే మరీ కుర్రదానివై పోతావు. ఆ అందం కళ్ళారా చూడాలని" నసిగాడు సుందరం.

"మీ ఇష్టం!" అనేసి తన పొడవాటి వాలు జడని వయ్యారంగా ఊపుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది వనజ.




ఆమెనీ... ఆమె జడనీ చూస్తూ అష్టవంకర్లు తిరిగాడు సుందరం.

ఆఫీసులో కొలీగ్ దగ్గర మరదలికి నైటీ కొనాలని అబద్ధం చెప్పి అప్పుగా మూడొందలు తీసుకున్నాడు సుందరం. సాయంత్రం ఐదు కాగానే ఆఫీసులోంచి బయటపడి తన డొక్కు సైకిల్ని తొక్కుకుంటూ షాపింగుకి బైల్దేరాడు.

సెంటర్లో నిలబడి ఏం చేద్దామా అని దీర్ఘంగా ఆలోచిస్తూంటే అప్పుడు కనిపించింది సుందరానికి ఎదురుగా కట్టిన బ్యానర్.

"కందిన బ్రదర్స్ - లేడీస్ రెడీమేడ్ షోరూం ప్రారంభం - ఒక నైటీ కొంటే మరో నైటీ ఫ్రీ - స్టాకు పరిమితం"

తన అదృష్టం పండి, కందినలో పడిందనుకున్నాడు సుందరం. స్టాకు అయిపోతుందేమోనన్న తొందరలో రోడ్డుకి అవతలి పక్కన ఉన్న షాపుకి వెళ్ళేందుకు సైకిలుతో రోడ్డుని క్రాస్ చెయ్యబోయాడు.

వేగంగా వస్తున్న లారీ హఠాత్తుగా రోడ్డు కడ్డంగా వచ్చిన సుందరాన్ని గుద్దేసింది.

మూడ్రోజుల తర్వాత సుందరం స్పృహలోకొచ్చాడు. భార్య వనజ ముందుకి వంగి "ఎలా ఉందండీ?" అడిగింది భర్తని ఆదుర్దాగా.

"నైటీనా? చూళ్ళేదుగా..." అన్నాడు నీరసంగా సుందరం.

"నైటీ సంగతి తర్వాత. ముందు హాస్పిటల్ బిల్ సంగతి చూడాలి. కోరికలు పెరిగితే మన లాంటి మధ్యతరగతి వాళ్ళ జీవితం తట్టుకోలేదండీ! మీరు కళ్ళు మూసుకుని పడుకోండి" అంది వనజ.

భార్య చెప్పినట్టు బుద్ధిగా కళ్ళు మూసుకున్నాడు సుందరం. అతనికి డాబా మీద నైటీ వేసుకుని తిరుగుతున్న వనజ కనిపించింది.

"నైటీలో ఎంత బాగున్నావు వనం!" కళ్ళు మూసుకునే అప్రయత్నంగా అనేసాడు సుందరం.

వనజ తల పట్టుకుంది!